విత్తుకు పొలాలు సిద్ధం

- పొలాలను చదును చేస్తున్న రైతులు
- వర్షం కురిస్తే విత్తనం నాటడానికి ఏర్పాట్లు పూర్తి
- అధికంగా మొక్కజొన్న సాగుపై అన్నదాతల ఆసక్తి
- ఇప్పటికే బోరుబావుల కింద సాగు


పాములపాడు వద్ద పొలంలో ఎద్దుల సేద్యం చేస్తున్న రైతు

పాములపాడు: వేసవి కాలం ముగింపు దశకు వచ్చింది. ఇక రైతు కాలం వచ్చేస్తుంది. పొలాలు హరిత వర్ణంతో కళకళలాడేందుకు సిద్ధం అయ్యాయి. ఖరీఫ్ కోసం రైతన్నలు పొలాలను సిద్ధం చేస్తున్నారు. వర్షం కురిస్తే పొలాల్లో విత్తనాలు నాటడమే తరువాయి. కాగా ఈ ఏడాది మొక్కజొన్న సాగుపై ఎక్కువ మంది రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఆ తరువాతి స్థానంలో సోయాబీన్ వేసేందుకు సిద్ధమయ్యారు.

18,750 ఎకరాల్లో పంటల సాగు

మండలంలో 18,750 ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేయడం జరుగుతుంది. ప్రధాన పంటలు కేసీ కెనాల్ ఆయకట్టు కింద వరి, మొక్కజొన్న పైర్లు సాగు చేస్తున్నారు. ఖరీఫ్ పనుల్లో భాగంగా పొలాల్లో ప్రకృతి ఎరువులు (పేడ దిబ్బలు) వేస్తున్నారు. కార్తీ నాటికి వాతావరణం చల్లబడి వర్షాలు కురుస్తాయనేది రైతుల నమ్మకం. ఆ సమయానికంతా పొలాలను పూర్తిగా సిద్ధం చేసి ఉంచుతున్నారు.

10 వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగయ్యే అవకాశం..

వ్యవసాయ శాఖ అధికారుల అంచనా ప్రకారం మొక్కజొన్న 10వేల ఎకరాలు, సోయాబీన్ 4,750 ఎకరాలు, పత్తి వెయ్య ఎకరాలు, కంది 15,00 ఎకరాలు, వరి 2,500 ఎకరాల విస్తీర్ణంలో పంటలు సాగు చేసే అవకాశం ఉంది. ఈ సంవత్సరం వేసవి కాలంలో కూడా ఓ మోస్తరు వర్షాలు కురవడంతో బోరు బావులు, వ్యవసాయ బావుల్లో నీటి ఊటలు పెరిగాయి. దీంతో ఇప్పటికే ముందస్తుగా మొక్కజొన్న, పత్తి విత్తనం వేయడం జరిగింది.

ఆర్బీకేల్లో అందుబాటులో ఉన్న విత్తనాలు

మండలంలోని 14 గ్రామపంచాయతీ పరిధిలోని ఆర్బీకే కేంద్రాల్లో ఆయా ప్రాంతాలకు సంబంధించి ప్రభుత్వం విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచింది. వీటితో పాటు కాంప్లెక్స్ ఎరువులు, పురుగు మందులను కూడా అందజేస్తున్నారు. మండలంలోని అన్ని ఆర్బీకేల్లో ఇప్పటికే పలు విత్తనాలను ప్రభుత్వం సిద్ధం చేసి ఉంచింది. ప్రస్తుతం జీలుగ 150 క్వింటాళ్లు, కంది 10 క్వింటాళ్లు, మినుము 10 క్వింటాళ్ల చొప్పున ఉన్నాయి. వీటిని 50శాతం సబ్సిడీతో రైతులకు అందజేస్తారు. కాగా సోయా బీన్ 250 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయి. కిలో రూ.80 పూర్తి ధరతో రైతులకు అందిస్తున్నారు.

రైతులు విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు వహించాలి



ఆర్బీకేల్లో కొన్ని రకాల విత్తనాలు సబ్సిడీలో రైతులకు అందుబాటులో ఉంచాము. కాగా లైసెన్స్ కలిగిన దుకాణాల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలి. ప్రైవేలు వ్యక్తుల వద్ద కొనుగోలు చేయరాదని, నకిలీలు వచ్చే ప్రమాదం ఉందని చెబుతున్నాం. రైతులు జాగ్రత్తలు పాటించి విత్తనాలు కొనుగోలు చేయాలి. ప్రైవేటు వ్యక్తులు గ్రామాల్లో వచ్చి విక్రయాలు జరిపితే సమాచారం ఇస్తే వారిపై చర్యలు తీసుకుంటాము.

–ఫణీశ్వరరెడ్డి, వ్యవసాయాధికారి

వర్షం కురిస్తే విత్తనం నాటుతాం



వర్షం కురిస్తే విత్తనాలు వేస్తాం. ఇప్పటికే భూములను సిద్ధం చేసి ఉంచాము. నాకున్న 20 ఎకరాల పొలంలో మొక్కజొన్న, సోయాబిన్, మిరప పంటలు వేయాలనుకుంటున్నాను. విత్తనాలు తెచ్చి పెట్టుకున్నాను. ఎరువులు కూడా రెడీగా ఉంచుకున్నాను.

– అంబయ్య, రైతు లింగాల

పొలాలు చదును చేస్తున్నాం



పొలాల్లో సేద్యాలు చేస్తూ చదును చేస్తున్నాము. మొదటి వర్షం కాకుండా రెండవ సారి వర్షం కురిస్తేనే పొలాల్లో విత్తనాలు నాటుతాం. ప్రభుత్వం సబ్సిడీపై మొక్కజొన్న విత్తనాలు ఇస్తే బాగుంటది. ఈ సంవత్సరం చాలా మంది సోయాబీన్ విత్తనం వేయాలని అనుకుంటున్నారు. సోయాబీన్ కూడా సబ్సిడీపై ఇవ్వాలి.

– పెద్దస్వామి, రైతు పాములపాడు

క్లుప్తంగా

మున్సిపాలిటీ మేనేజర్‌గా మంజునాథ్‌గౌడు



నందికొట్కూరు: మున్సిపాలిటీ మేనేజర్‌గా మంజునాథ్‌గౌడు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఎమ్మిగనూర్ మున్సిపాలిటీలో ఆర్వోగా పని చేస్తూ సాధారణ బదిలీపై ఆయన నందికొట్కూరు మున్సిపాలిటీకి వచ్చారు. మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు.

విద్యుత్ మోటారుకు మరమ్మతులు


విద్యుత్ మోటారు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

పాములపాడు: మండలంలోని తుమ్మలూరు గ్రామంలో తాగునీరు సరఫరా చేసే విద్యుత్ మోటారును సర్పంచు వరప్రసాద్, పంచాయతీ కార్యదర్శి పుల్లయ్యలు బుధవారం మరమ్మతులు చేయించారు. గ్రామంలోని బీసీ కాలనీలో రెండు రోజుల క్రితం బోరు మరమ్మతులకు గురైందన్నారు. దీంతో ఆ కాలనీ వాసులు తీవ్రంగా ఇబ్బందిపడాల్సి వచ్చిందన్నారు. వెంటనే మెకానిక్‌ను తీసుకువచ్చి మరమ్మతులు చేయించి కాలనీలో నీటి సమస్య లేకుండా చేశామని చెప్పారు.

ఉద్యాన పంటలపై అవగాహన


రైతులకు సూచనలిస్తున్న ఏపీడీ అన్వరాబేగం

కొత్తపల్లి: ఉద్యాన పంటలపై రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఉపాధి హామీ పథకం ఏపీడీ అన్వరాబేగం తెలిపారు. బుధవారం స్థానిక ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయంలో రైతులు, వలంటీర్లు, ఆర్బీకే సిబ్బందికి ఉద్యాన పంటల సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రైతులు సాధారణ వ్యవసాయం నుంచి ఉద్యాన తోటల పెంపకంపై దృష్టి సారించాలన్నారు. తోటల పెంపకంతో రైతన్నల ఆర్థిక పరిస్థితి మారిపోతుందన్నారు. మండలానికి 250 ఎకరాల్లో తోటల సాగు చేసుకునేలా అన్నదాతలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఓ రేష్మ, ఈసీ శ్రీనివాసులు, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రం తనిఖీ

పాములపాడు: స్థానిక ఏపీ మోడల్ స్కూలులో జరుగుతున్న 10వ తరగతి పరీక్షా కేంద్రాన్ని స్క్వాడ్, నంద్యాల ఎంఈఓ బ్రహ్మంనాయక్ బుధవారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ మొత్తం పరీక్షకు హాజరుకావాల్సిన సైన్స్ పరీక్షకు 138 మంది విద్యార్థులకు గాను 23 మంది గైర్హాజరు అయ్యారని, కేవలం 115 మంది మాత్రమే పరీక్షకు హాజరు అయినట్లు తెలిపారు.

ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి


శ్రీశైలంప్రాజెక్ట్: ఆంధ్రప్రదేశ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం సున్నిపెంట అంబేడ్కర్ సెంటర్‌లో ఉద్యోగులు రిలే నిరాహార దీక్ష చేశారు. ఉద్యోగులు ఇచ్చిన 160 డిమాండ్లను ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని కోరారు. గత నెల 22వ తేదీ నుంచి అక్టోబర్ 31వ తేదీ వరకు రిలే నిరాహార దీక్షలు చేపడతామని, ప్రభుత్వం ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించకపోతే ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

రైతు భరోసా కేంద్రాల తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న ఏడీఏ ఆంజనేయులు

వెలుగోడు: మండలంలోని రైతు భరోసా కేంద్రాలను ఆత్మకూరు ఏడీఏ ఆంజనేయులు తనిఖీ చేశారు. బుధవారం రేగడ గూడూరు 1, 2, వేల్పనూరు- 1,2, వెలుగోడు -2 రైతు భరోసా కేంద్రాలను ఏడీఏ సందర్శించారు. అనంతరం వెలుగోడులో ఉన్న విత్తన దుకాణాల్లో ఎరువులు, విత్తనాల వాటి నిల్వలను తనిఖీ చేశారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి ఆర్.పవన్ కుమార్, సిబ్బంది ఉన్నారు.

మహానందీశ్వరుడికి కల్యాణోత్సవం



మహానంది: మహానందిలో కొలువైన శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లకు బుధవారం కల్యాణోత్సవం కనులపండువగా జరిగింది. వేదపండితులు రవిశంకర అవధాని ఆధ్వర్యంలో అర్చకులు స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించారు. గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకార పూజ, అక్షతల సమర్పణ, మాంగళ్య ధారణ పూజలను శాస్త్రోక్తంగా చేపట్టారు. వివిధ ప్రాంతాల భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు. కల్యాణం అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

హాస్టల్ సీటుకు దరఖాస్తు చేసుకోండి

జూపాడుబంగ్లా: ఈనెల 12న పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో జూపాడుబంగ్లా ఎస్సీ హాస్టల్‌లో సీట్ల కోసం విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలని హాస్టల్ వార్డెన్ ఉమాదేవి తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ హాస్టల్‌లో చేరదలచిన విద్యార్థినులు ఆధార్, తల్లిదండ్రుల ఆధార్ జిరాక్సు కాపీలతో పాటు రేషన్‌కార్డు, బ్యాంకు (వ్యక్తిగతం, తల్లిది)పుస్తకం జిరాక్సు కాపీలతో పాటు విద్యార్థిని ట్రాన్స్‌ఫర్ సర్టిఫికేట్(టీసీ), కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు 3 పాసు ఫోటోలను జత పరిచి జూపాడుబంగ్లా హాస్టల్‌లో అందజేయాలన్నారు. పూర్తి వివరాల కోసం సెల్: 7780357293 కి ఫోన్‌చేయవచ్చునన్నారు.

నేడు వలంటీర్లకు సన్మానం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మండల పరిధిలోని సచివాలయాల పరిధిలో విధులు నిర్వహిస్తున్న వలంటీర్లకు గురువారం శ్రీశైలంలో సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్న శ్రీశైలం మండల వైఎస్సార్సీపీ మండల ఇన్‌చార్జ్ భరత్‌రెడ్డి తెలిపారు. శ్రీశైలంలోని మల్లికార్జున కల్యాణ మండపం వద్ద కార్యక్రమం ఉంటుందని, ముఖ్య అతిథిగా శ్రీశైలం నియోజకవర్గ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి హాజరవుతారని తెలిపారు.

ఉపాధి పనులపై సమీక్ష

నందికొట్కూరు రూరల్ : మండలంలో వివిధ గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులపై ఎంపీడీఓ శోభారాణి బుధవారం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడు తూ జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి అధికారులు ఉపాధి పనులు చూపించాలన్నారు. ఉపాధి హామీ పనుల వద్ద మౌలిక వసతులు కల్పించాలని సూచించారు.

మట్టి అక్రమ తరలింపు అడ్డగింత


మట్టి తరలింపును నిలిపివేయాలని ట్రాక్టర్ యజమానిని కోరుతున్న మాజీ సర్పంచ్ చెన్నయ్య

పగిడ్యాల: మండలంలోని సంకిరేణిపల్లె నాపరాతి గనుల నుంచి ఎర్రమట్టిని అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను గ్రామస్తులు బుధవారం అడ్డుకున్నారు. నాలుగు రోజులుగా ప్రభుత్వానికి ఎలాంటి రాయల్టీ చెల్లించకుండా 11 మంది ట్రాక్టర్ యజమానులు అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని గ్రామ పెద్దలు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం గ్రామంలో జగనన్న ఇళ్లు నిర్మించుకుంటున్న వారికి, సొంతంగా ఇంటి నిర్మాణాలు చేపట్టిన వారికి భరంతిలు పూడ్చుకోవడానికి మట్టి దొరకని పరిస్థితులు ఉన్నాయన్నారు. అయితే పగిడ్యాలకు చెందిన ఖలీల్, ఈశ్వరయ్య, తహర్ బాషా, నడిపి బాషా, శివ, జంబులయ్య, ఎర్ర ప్యారీ, నెహ్రూనగర్ శంకర్ తదితరులు జట్టుగా ఏర్పడి మరి కొన్ని ట్రాక్టర్‌లను పిలుచుకుని రోజుకు వంద ట్రిప్పులకు పైగా బయటి ప్రాంతాలకు మట్టి తరలించి సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. ట్రిప్పు రూ. 5 వేలు పెడితే కూడా తమకు మట్టి దొరకని పరిస్థితి ఉందని, మా గ్రామంలోని వందల ఏళ్ల నాటి నాపరాతి గనుల ఎర్రమట్టిని అక్రమంగా తరలించడం భావ్యమేనా అంటూ నిలదీశారు. అయినా వారు వినకపోవడంతో ట్రాక్టర్‌లను నిలిపి వేసి ముచ్చుమర్రి పోలీసులకు మౌఖికంగా ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ఎస్ఐ నాగార్జున మాట్లాడుతూ.. ప్రభుత్వ అనుమతి లేకుండా మట్టిని తరలిస్తున్నారని మాజీ సర్పంచ్ చెన్నయ్య తమ దృష్టికి తెచ్చారన్నారు. గ్రామస్తుల అనుమతి లేకుండా మట్టిని తరలించరాదని వెంటనే నిలిపివేయాలని ట్రాక్టర్ యజమానులకు చెప్పామని స్పష్టం చేశారు.

అశ్రునయనాల మధ్య రోడ్డు ప్రమాద మృతుల అంత్యక్రియలు


బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న శిల్పా భువనేశ్వర్‌రెడ్డి

వెలుగోడు: కర్ణాటక రాష్ట్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వెలుగోడు, బండి ఆత్మకూరు వాసులకు బుధవారం అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు పూర్తి అయ్యాయి. ఈ నెల 6వ తేదీ దైవ దర్శనానికి వెళ్తుండగా కర్ణాటక రాష్ట్రం యాదగిరి జిల్లాలో తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. తుఫాన్స్ వాహనం ఆగివున్న లారీ ఢీ కొట్టడంతో ఐదుగురు మృతి చెందారు. 13 మందికి గాయాలైన విషయం విధితమే. వెలుగోడుకు చెందిన చెందిన షేక్ రమిజాబీ(48), న్యామతుల్లా(40), సుమయా(12), బండి ఆత్మకూరు మండలానికి చెందిన గడ్డమీది మునీర్ బాషా(37), ముదషీర్ (12) అక్కడికక్కడే మరణించారు. వీరి మృతదేహాలను ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి తన సొంత ఖర్చులతో స్వస్థలానికి తరలించారు. బుధవారం వెలుగోడు పట్టణానికి వారి మృతదేహాలు చేరుకోగా సమీప బంధువులు, కుటుంబసభ్యులు, స్నేహితులు, సన్నిహితులు బోరున విలపించారు. గ్రామంలో ఒక్కసారిగా ఉద్విగ్నభరిత వాతావరణం నెలకొంది. ముస్లిం శ్మశానవాటికలో జరిగిన అంత్యక్రియలకు వందలాదిమంది హాజరై కన్నీటితో వీడ్కోలు పలికారు.

బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చిన శిల్పా భువనేశ్వర్‌రెడ్డి

రోడ్డు ప్రమాదంలో మరణించిన రజియాబీ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు శిల్పా భువనేశ్వర్‌రెడ్డి ఓదార్చారు. మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబానికి అన్ని విధాల ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అండగా ఉంటారని ధైర్యం చెప్పారు. ఆయన వెంట పట్టణ అధ్యక్షుడు ఇలియాస్‌ఖాన్, జిల్లా కో-ఆప్షన్ సభ్యుడు సయ్యద్ సులేమాన్, ఖాదర్‌వలి, ఖాద్రీ, షంషీర్ అలీ ఉన్నారు.

ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న స్టార్ యూత్ అసోసియేషన్ సభ్యురాలు

వెలుగోడు: ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవాలని స్టార్ యూత్ అసోసియేషన్ ప్రోగ్రాం ఆఫీసర్ లక్ష్మి సూచించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో ఏపీఎం సుగుణపాల్ అధ్యక్షతన ప్రపంచ ఆహార భద్రత దినోత్సవాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. ఒక రైతు పగలనక రేయినక ఆ పంట పండించడానికి ఎంత కష్టపడతాడో గుర్తు చేసుకుని ఆహారాన్ని వృథా చేయవద్దన్నారు. 2018 నుంచి ఐక్యరాజ్య సమితి జూన్ 7వ తేదీని ''ప్రపంచ ఆహార భద్రతా దినోత్సవం''గా నిర్వహిస్తోందని చెప్పారు. ప్రస్తుత సమాజంలో మారుతున్న ఆహారపు అలవాట్లు, జంక్ ఫుడ్ కారణంగా జనాలు మరింతగా అనారోగ్య పాలవుతున్నారు. కార్యక్రమంలో స్టార్ యూత్ అసోసియేషన్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ ఖాదర్‌వలి, వెలుగు సిబ్బంది నూరుల్లా, శివమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఓంకారంలో భక్తులసందడి

మహానంది: బండిఆత్మకూరు మండలం ఓంకారం క్షేత్రంలో బుధవారం భక్తులసందడి కనిపించింది. వేసవి సెలవులు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులు శ్రీ ఓంకార సిద్ధేశ్వర స్వామిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు. దర్శనం అనంతరం మెట్లమార్గం ద్వారా కొండపైకి వెళుతూ మార్గంలో కొలువైన ఆలయాలను తిలకించారు. స్థానిక కాశిరెడ్డినాయన ఆశ్రమంలో భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. అర్చకులు ఓంకారసిద్ధేశ్వరస్వామి వారికి అష్టవిధ మహామంగళ హారతులు, అభిషేకార్చనలు చేపట్టారు.

తాగునీరు కలుషితం


మంచినీటి పైప్‌లైన్‌కు ఏర్పడిన లీకేజీ

పగిడ్యాల: మండలంలోని నెహ్రూనగర్ సచివాలయం-2 సమీపాన ప్రధాన రహదారి పక్కన పైప్ లైన్ లీకేజీ ఏర్పడి తాగునీరు కలుషితమవుతోంది. ఇరవై రోజులకు పైగా పైప్‌లైన్ లీకేజీ అవుతున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయం. నిత్యం పశువులు, పందులు, కుక్కలు ఈ లీకేజీ నీటిలో పొర్లుతాయని, కలుషితమైన ఆ నీరే జీఎల్ఎస్ఆర్ సిస్టమ్ ట్యాంక్‌లకు సరఫరా అవుతున్నాయని ఎస్సీ కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కలుషిత నీరు తాగి జలుబు, దగ్గు, జ్వరం, వాంతులు, విరేచనాలు వంటి అంటురోగాల బారినపడుతున్నామని వాపోతున్నారు. సంబంధిత పంచాయతీ అధికారులు స్పందించి పైప్‌లైన్ లీకేజీని అరికట్టి ప్రజలకు స్వచ్ఛమైన రక్షిత మంచి నీటిని సరఫరా చేయాలని కోరుతున్నారు.

సీనియర్ అసిస్టెంటుకు పదోన్నతి

జూపాడుబంగ్లా: జూపాడుబంగ్లా మండల అభివృద్ధి కార్యాలయంలో సీనియర్ అసిస్టెంటుగా విధులు నిర్వహిస్తున్న సురేష్ పదోన్నతిపై మిడుతూరు సూపరింటెండెంటుగా(ఏఓ) బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కొత్తవారిని నియమించలేదు. అలాగే జూపాడు బంగ్లా మండల హౌసింగ్ ఏఈ శ్రీనాథ్ పగిడ్యాల హౌసింగ్ ఏఈగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో పగిడ్యాల మండల హౌసింగ్ ఇన్‌చార్జి జ్యోతి జూపాడు బంగ్లాకు నియమిస్తూ జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీచేశారు.

వెలుగోడు సొసైటీ సీఈవో సువర్ణ ఆచారి కన్నుమూత

వెలుగోడు: వెలుగోడు వ్యవసాయ ప్రాథమిక సహకార కేంద్రం సీఈవో కంసలి వెంకట సువర్ణ ఆచారి(56) గుండెపోటుతో మృతి చెందారు. నంద్యాల హృదయానంద ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మరణించారు. సువర్ణ ఆచారికి భార్య రమాదేవి, కుమారుడు, కూతురు సంతానం. దాదాపు 35 సంవత్సరాలుగా సొసైటీలో విధులు నిర్వహిస్తున్నారు.

మున్సిపాలిటీ వాటర్‌మన్ మృతి

నందికొట్కూరు: మున్సిపాలిటీలో ఇంజినీరింగ్ సెక్షన్‌లో పని చేస్తున్న వాటర్‌మెన్ చెరుకు శేషాద్రి(45) అనారోగ్యంతో మృతి చెందారు. 16 ఏళ్ల నుంచి వాటర్ సెక్షన్‌లో పని చేస్తున్నారు. అనారోగ్యంతో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కోలుకోలేక బుధవారం మృతి చెందారు. మృతుడికి భార్య శ్యామల, ముగ్గురు పిల్లలు ఉన్నారు. 23వ వార్డు కౌన్సిలరు చెరుకు సురేష్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 6 వేలు ఆర్థికసాయం అందించారు.

ఆలయ ద్వారాల ఏర్పాటు


ద్వారాలను ఏర్పాటు చేసిన దృశ్యం

మిడుతూరు: స్థానిక శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయ గాలిగోపురం నిర్మాణ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆలయానికి ప్రధాన ద్వార మందిరాలను ఏర్పాటు చేశారు. పురోహితులు సుబ్రమణ్యం శర్మ, రవితేజల ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చరణల మధ్య శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. దాతలు, గ్రామస్తుల సహకారంతో విరాళాలు సేకరించి టీటీడీ నిధుల సహకారంతో ఆలయ గాలిగోపుర నిర్మాణానికి గత ఏడాది శ్రీకారం చుట్టారు.

మల్లన్నకు నృత్య నీరాజనం


నృత్యం చేస్తున్న కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆలయ దక్షిణ మాడ వీధిలోని నిత్యకళావేదికపై కర్నూలుకు చెందిన సిద్ధేంద్రయోగి లాస్య కూచిపూడి కళాక్షేత్రం వారు సంప్రదాయ నృత్యం ప్రదర్శించారు. కార్యక్రమంలో వినాయక కౌత్వం, భో..శంభో, శివశంభో, జతిస్వరం, అదిగదిగో శ్రీశైలం, నటేశకౌత్వం తదితర గీతాలకు ఆంజనేయులు, సుప్రిత, చంద్రకళ, బాలచంద్రుడు, కల్యాణ్, మహిమాశ్రీ తదితరులు నాట్యం చేశారు.

హత్య చేసిన వారిని అరెస్ట్ చేయాలి

ఆత్మకూరు: ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం రాయవరం గ్రామంలో అంగన్‌వాడీ కార్యకర్త హనుమాయమ్మను కిరాతకంగా ట్రాక్టర్‌తో తొక్కించి, హత్య చేసిన కిరాతకులను అరెస్ట్ చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్ యూనియన్ నాయకురాలు మంజులా, లక్ష్మీదేవి, పరిమళ కోరారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు బుధవారం ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ ప్రకాష్‌బాబుకు వినతిపత్రం సమర్పించారు. స్వప్న, అనసూయ తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి


మాట్లాడుతున్న ఆర్డీవో దాసు

ఆత్మకూరు: మున్సిపాలిటీ పరిధిలోని జగనన్న కాలనీలో పక్కా గృహాల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆర్డీఓ దాసు ఆదేశించారు. పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో బుధవారం హౌసింగ్ అధికారుల సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు పట్టణంలో 4,200 మంది లబ్ధిదారులకు పక్కా గృహాలు మంజూరయ్యాయని, ఇందులో చక్రం హోటల్, మైనార్టీ కాలనీ, దుద్యాల రస్తాలలో ఇళ్ల నిర్మాణాల్లో లబ్ధిదారులు ఆలస్యంగా చేయడం సరికాదన్నారు. యుద్ధప్రాతిపదికన ఇంటి నిర్మాణాలు పూర్తి చేయాలని చెప్పారు. ఈ నెల 9న ఆత్మకూరు పట్టణంలో నిర్వహించే జాబ్‌మేళాను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, హౌసింగ్ డీఈ ఉమామహేశ్వరరావు, వైఎస్సార్సీపీ పట్టణ అధ్యక్షుడు అంజాద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు రైతు భరోసా మంజూరు చేయాలి


మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో రవీంద్రారెడ్డి

ఆత్మకూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రైతు భరోసా కార్యక్రమాన్ని చెంచు గిరిజనులకు సైతం పొందేలా చర్యలు తీసుకోవాలని శ్రీశైలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రవీంద్రారెడ్డి కోరారు. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చెంచు గిరిజనులకు ఇప్పటికే రైతు భరోసా, ఈ-క్రాప్ విధానంపై అవగాహన కల్పించామన్నారు. రైతు భరోసా వివిధ కారణాల వలన లబ్ధిపొందని చెంచు గిరిజనులను వ్యవసాయ అధికారులు గుర్తించి, వారికి పెట్టుబడి సాయం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ ఆంజనేయులు, ఐటీడీఏ ప్రత్యేక అధికారి నాయక్, ఏవో విష్ణువర్ధన్ రెడ్డి, కొత్తపల్లి ఏవో మహేష్ తదితరులు పాల్గొన్నారు.

గాలీవాన బీభత్సం

మహానంది: మహానంది మండలంలో బుధవారం రాత్రి గాలీవాన బీభత్సం సృష్టించింది. దీంతో నంద్యాల-మహానంది మార్గంలోని బుక్కాపురం, అల్లీనగరం గ్రామాల మధ్యన చెట్లు విరిగిపడటంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో గ్రామాల్లో అంధకారం అలుముకుంది. ఓ వైపు భారీ వర్షం, మరోవైపు అంధకారం ఉండటంతో మహానంది, నంద్యాల వైపు వెళ్లే ప్రయాణికులు, పర్యాటకులు ఇబ్బందులు పడ్డారు. స్థానికులు కొందరు స్పందించి రోడ్డుకు అడ్డంగా పడి ఉన్న చెట్లను పక్కకు తప్పించడంతో రాకపోకలు యథావిధిగా సాగాయి. సుమారు రెండు గంటల పాటు వాహనాలు నిలిచిపోయాయి. అరటితోటల్లో అరటిచెట్లు నేలకొరిగాయి.

బండిఆత్మకూరు మండలంలో భారీ వర్షం

మహానంది: బండిఆత్మకూరు మండలంలో బుధవారం రాత్రి గాలీవాన బీభత్సం సృష్టించింది. మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో భారీ వర్షం కురవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో గ్రామాల్లో అంధకారం అలుముకుంది. సుమారు రెండు గంటల పాటు సరఫరా నిలిచిపోయింది. నారాయణాపురం మార్గంలో భారీ గాలులకు చెట్లు నేలకొరిగాయి.

12లోపు నాడు-నేడు పనులు పూర్తి చేయండి


మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల: మన బడి నాడు- నేడు పథకం కింద ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న పనులు ఈ నెల 12వ తేదీలోపు పూర్తి స్థాయిలో పూర్తి చేయాలని సంబంధిత ఇంజినీర్లు, ఎంఈఓలను జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఆదేశించారు. బుధవారం ఆయన ఛాంబర్‌లో జాయింట్ కలెక్టర్ నిశాంతితో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పనుల ప్రగతిపై మండలాల వారీగా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నందికొట్కూరు మండలంలో అత్యంత తక్కువగా ప్రగతి చూపిన పంచాయతీరాజ్ ఏఈకి షోకాజ్ నోటీస్ జారీ చేయాలని ఆదేశించారు. పెద్ద, చిన్న మరమ్మతులు, కిచెన్ షెడ్, రూఫ్ సీలింగ్, టాయిలెట్ల నిర్మాణం, ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లతో విద్యుద్దీకరణ, తాగునీటి సరఫరా, విద్యార్థులు, సిబ్బంది కోసం ఫర్నీచర్, పాఠశాలలకు పెయింటింగ్, ఆకుపచ్చ సుద్ద బోర్డులు తదితర పనులు వేగవంతం చేయాలన్నారు. స్థానిక సమస్యలు ఉన్న జూపాడుబంగ్లా తదితర మండలాల్లో పంచాయతీరాజ్ ఇంజినీర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పూర్తి చేయాలని చెప్పారు. విద్యా కానుక కిట్ల నాణ్యతపై అన్ని మండలాల నుంచి వివరాలు సేకరించారు. ఈనెల 11వ తేదీ సాయంత్రంలోపు అన్ని ప్రభుత్వ పాఠశాలలకు జగనన్న విద్యా కానుక కిట్లు సరఫరా కావాలని సూచించారు. బడి బయట ఉన్న పిల్లల సర్వే 89 శాతం పూర్తయిందని గురువారం సాయంత్రంలోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. డీఈఓ అనురాధ, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి, సమగ్ర శిక్ష సెక్టోరల్ అధికారి లలిత పాల్గొన్నారు.

అరగంటకోసారి విద్యుత్ అంతరాయం

- సబ్‌స్టేషన్‌లో 80బన్నూరు ఫీడర్ బ్రేకర్ సమస్య
- ప్రతి అరగంటకు ట్రిప్ అవుతున్న వైనం
- సమస్య పరిష్కరించని అధికారులు


జూపాడుబంగ్లా విద్యుత్ సబ్‌స్టేషన్

జూపాడుబంగ్లా: జూపాడుబంగ్లా విద్యుత్ సబ్‌స్టేషన్‌లో 80బన్నూరు ఫీడర్ బ్రేకర్ సమస్య ఉండటంతో అరగంటకోమారు ట్రిప్ అవుతుండటంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం నెలకొంటోంది. దీంతో విద్యుత్ వినియోగదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. 80బన్నూరు ఫీడర్ కింద తాటిపాడు, పోతులపాడు, 80 బన్నూరు, చాబోలు గ్రామాలున్నాయి. ఆయా గ్రామాల్లో 2,200 గృహవిద్యుత్ వినియోగదారులు, 120 బోర్లు, బావుల విద్యుత్ కనెక్షన్లున్న రైతులున్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం నెలకొంటుండటం వేసవికాలం కావడం , ఎండలు మండుతుండటంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. పక్షం రోజుల నుంచి సమస్య ఉన్నా పరిష్కరించటంలో సంబంధిత అధికారులు నిమ్మకునీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ట్రాన్స్‌కో ఏఈ రామాచారిని వివరణ కోరగా సమస్యను త్వరలో పరిష్కరించి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేస్తామని తెలిపారు.